# ౨. కీలకం

కాఫీహోటల్ ముందు నిలబడి సిగిరెట్‌పొగ వొదుల్తూ జేబులో చెయ్యిపెట్టి తడివాడు. రెండే రెండు రూపాయిలు అతని వేళ్ల మధ్య తిరిగినయ్. వీటితో రెండు రోజులు గడుస్తయ్ కాని, ఆ తర్వాత?

కాలేజీ జీవితంలోంచి బైటపడ్డప్పటినుంచీ తను ఎదుర్కోవాల్సిన కష్టాలు దినదినాభివృద్ధికా జొచ్చినయ్, వాటిని వొదిలించుకునే విద్యను తను యెన్నడూ నేర్చుకోలేదు. తను పని చెయ్యగలడు, ఎవరైనా ఉద్యోగం యిస్తే. తన విశ్వాసాన్నీ, పని తనాన్నీ చూపి యజమానిని తృప్తిపరచగలడు. కాని మచ్చుకైనా నాలుగురోజులు పాటు తనచేత ఊరికేనైనా పనిచేయించుకునే నాధుడేడీ?

ఒక్కటేసమస్య అతన్ని బాధిస్తోంది– తను కనీసం బ్రతకటం ఎలా? ఇంట్లోంచి తెచ్చుకున్న రెండొందలకు బదులు, మొదటి అంకెమాత్రమే మిగిలింది. మరోరెండు రోజుల్లో తనొక్కడే మిగుల్తాడు. డబ్బు తరగటం ప్రారంభించినప్పటినుంచీ అతని గుండెల్లోని రాయి బరువవసాగింది... తన గతి ఎంతలో ఎంతైందీ!

తనముందు రోడ్డుమీద బరబరా సాగిపొయ్యే రిక్షాలూ, తాళం వేస్తూన్నట్టు డెక్కల్తో రోడ్డుమీద చప్పుడు చేసుకుంటూ పరుగులెత్తే గుర్రబ్బళ్ళూ, హాయినీ తృప్తినీ సూచించే ముఖాల్తో లోకం ఎంతో ఆనందదాయకమైందని సూచించే చిరునవ్వుల్తో, ముందేదో మించిపొయ్యే ఆనందం వున్నదన్నట్టు చకచకా సాగిపొయ్యే జనమూ కనిపిస్తున్నారు. వీళ్ళందరూ ఎలా సంపాయించి బతుకుతున్నారు? తనలాటి సమస్యలు వీళ్ళకెందుకు లేవు? ఎదురుగుండా కిళ్ళీ షాపువాడు ఇంట్లో దీపపు బుడ్డి అయినా– కొట్టుమీద దేదీప్యమానంగా వెలిగే రెండు పెట్రోమాక్స్ లైట్లతో తనూ తన జీతగాడూ

తీరిక లేకుండా ఎలా అమ్ముకో గలుగుతున్నారు? దేశంలో కరువని పత్రికల్లోని వార్తలూ, ఆకలి మీద కవిత్వమూ- ఇవన్నీ ఎంత అబద్ధమో తను చూసే దృశ్యమే చెప్తోంది. కాని తనలాగా వీళ్ళందరూ విచారంగా కనిపించరేం?

తను 'ఆర్ట్స్' పరీక్ష పాసయ్యాడు కాని, సంపాదన 'ఆర్ట్' మాత్రం అందులో లేదు. షేక్స్పియరూ, రస్కిన్ మొదలైన ఆంగ్లకవుల రచనలూ తను చదివి అర్థం చేసుకున్నాడు కాని, అందులో బతికే విధానాన్ని గూర్చిన ఛాయన్నా లేదు. వాళ్ళకూ, వాళ్ళ బాబులకూ కూడా ఆ సమస్యే లేదు కాబోలు!... ఇలా నిలబడి తను ఎన్నాళ్లు ఆలోచిస్తే దీని కీలకం తెలిసేట్టు? ఈ పరాయి వూళ్ళో, తన ఇంటికి ఐదువందల మైళ్ళ దూరంలో నిలబడి, గొంతెత్తి ఏడ్చినా ఎవరికి వినిపిస్తుంది కనుక?

"నమస్కారం పంతులుగారూ!"

ఉలిక్కిపడి చూశాడు. ఒక నల్లటివాడు పక్కగా నిలబడి నవ్వుతూ వినయంగా నమస్కరిస్తున్నాడు. వాడి రూపం చూస్తే తిరిగి నమస్కరించ బుద్ధి పుట్టక, తల కొద్దిగా వొంచి, 'ఏం?' అన్నట్టు కళ్ళు ఎగరేసి వూరుకున్నాడు.

"ఎక్కడికన్నా తీసుకువెళ్ళమంటారా?" అన్నాడు వాడు మెల్లిగా.

"ఎక్కడికీ?" అన్నాడు; వాడి భాష ప్రసాద్‌కు ఇంకా అర్థమవలేదు.

"భలేభలేవాళ్ళున్నారు. కళ్ళు మిరుమిట్లు కొలిపే-"

"ఉహుఁ" అర్థమౌతోంది. భావం షేక్స్పియర్ నాటకంలోలాగా క్లిష్టంగా మాత్రం తోచటంలేదు.

"ఒక్కసారి చూస్తే--"

ప్రసాద్ చప్పున చలించాడు . ఆ యీడులో అంతవరకూ అనుభవం లేనివాడు ఎవడైనా అంతేనేమో?

తలవూపి వాడి వెంట నడవసాగాడు. ప్రసాద్ తన సమస్యనే మరచిపోయి, కొత్త ఆలోచనల్తో బుర్ర వేడెక్కించుకోసాగాడు.

రెండు ఫర్లాంగులు నడిచాక ఆతృత కొద్దీ, "ఇంకెంత దూరం?" అన్నాడు ప్రసాద్.

"ఆ కనపడే యిల్లే--"

ప్రసాద్ ఒక్కసారి వెనక్కు చూసి, తను వొచ్చిన దారీ దూరమూ అర్థం చేసుకున్నాడు.

ఆ ఇల్లు అంతా వాడి సొంతమే ఐనట్టు ఆ నల్లవాడు లోపలికి జొరబడి, ప్రసాద్‌ను కూడా రమ్మన్నట్టు చూశాడు. ప్రసాద్ మొదట కొంచెం బెరుకు పడ్డాడు కాని, ముందువాణ్ని నమ్ముకొని, వాడి వెంట నడిచాడు.

చక్కగా అలంకరించిన గది, దేదీప్యమానంగా వెలిగే ఎలక్ట్రిక్ దీపం, పందిరి మంచంమీద ఇస్త్రీ మడతలు చెరగని తెల్లటి మల్లెమొగ్గలాటి దుప్పటీ- ఎంత బాగుంది!

నల్లవాడు కుర్చీ చూపి, లోపలికి వెళ్ళాడు.

కూర్చున్నందుకు ఏమన్నా తీసుకుంటారేమోననిపించే ఆ కుర్చీ మీద ప్రసాద్ ప్రాణాలు బిగబట్టుకొని కూర్చున్నాడు.

మూడు నిమిషాల్లో నల్లవాడు ఒక ఇరవైయేళ్ళ పడచును వెంటబెట్టుకు వొచ్చాడు. ఆమె నల్లవాడి వర్ణనకేమీ తీసిపోదు. ఆమెను చూస్తేనే కడుపు నిండుతుంది... ఎంత గొప్ప వాతావరణం!

సిగ్గుపడుతూన్న ఆమెతో, "చెప్పమ్మా--" అన్నాడు నల్లవాడు.

"నైటుకా?" అందామె, అది 'లైటో' 'నైటో' తెలియనంత నాజూకుగా.

"ఊఁ" అన్నాడు ప్రసాద్ ఒక గుటక మింగి.

"ఇరవై--"

ప్రసాద్ మొదట్లో చాలా ఆతృతపడ్డాడు, ఒక్క రాత్రికైనా యీమె తన దౌతుందేమోనని. దానికిగాను తన సర్వస్వమూ అర్పిద్దామనుకున్నాడు కాని, ఆమె తన సర్వస్వానికి పదింతలై కూర్చుంది.

"వెళ్దాం--" అన్నాడు ప్రసాద్ నిరాశతో, మెల్లిగా లేవబోతూ.

"కూర్చోండి. పోనీ ఇంత యిస్తామని చెప్పండి" అందామె.

ఇందులో బేరాలు కూడా వున్నయ్యని ప్రసాద్‌కు మొట్టమొదటిసారి తెలిసింది. ఏ వస్తువుకు ఎవరు ఎప్పుడు అధికారంతో ఇంత విలువని తేల్చి వుంచారు కనుక?

సున్నా కొట్టేయ్యమనేందుకు నోరాడలేదు. అంతకు పైన ఎంతైనా అప్పు చెయ్యాల్సిందే! తన దృష్టిలో ఆమె సౌందర్యం విలువ గొప్పగానే వుంది కాని ఏ విధంగా బేరం ఫైసలైనా రెండుకు మించితే మాత్రం లాభం లేదాయె!

"ఒద్దులే--" అన్నాడు ఇష్టంలేని చూపుల్తో గొణుగుతూన్నట్టు.

"పోనీ నచ్చకపోతే ఇంకా వున్నారు" అని అందుకున్నాడు నల్లవాడు. ఆమె మాట్లాడకుండా నిష్క్రమించింది. వరసాగ్గా మరి ముగ్గురు వొచ్చారు. నెంబరువారీ సరుకులాగు యీడులో అభిరుచికి తగినట్టు 'నీ యిష్టం' అన్నట్టున్నారు. రేట్లు మాత్రం రెండు హస్తాలదాకా వున్నయ్. తన దగ్గరే డబ్బుంటేనా అసలు జీవితాంతంవరకూ యీ ఇల్లు వదుల్తాడా?... తన ఊహాప్రపంచంలోంచి ఊడిపడ్డ దేవతల్లాగున్నవాళ్ళను చేతులారా వొదులు కోవాల్సి వొచ్చినందుకు ప్రసాద్ తన అసమర్థతను ఒక్క సారిగా తను తలచనంత ఘోరంగా చూడగలిగాడు. తను చదువుకునేప్పుడు ఉద్రేకం పొంగి

రాసిన భావగీతికలు అంకితం వేసుకునే లెక్కన్నా మాట్లాడితే బాగుండుననిపించింది కాని– యీ దేవతలకు తనూ కాదు తన భావగీతికలూ కాదు– కావాల్సింది!

ప్రసాద్ అవస్థను గ్రహించలేక నల్లవాడు అతనికి బాగా నచ్చచెప్పాలని చూశాడు కాని, చివరకు విసిగి, దారిలేక మెల్లిగా బైటికి దారితీశాడు.

రోడ్డెక్కగానే నల్లవాడు అన్నాడు:

"ఇంకా వున్నారు భలేవాళ్ళు" ప్రసాద్ నిరాశపడకుండా చూడటం నల్లవాడి బాధ్యతాయె మరి!

ప్రసాద్ అడిగాడు: "ఇంట్లోకి వెళ్లేందుకు భయంలేదా?"

"భయమేంటీ! వాళ్ళ వృత్తి అదే. ఎవరుపడితే వాళ్ళే వెళ్ళొచ్చు––"

"నీకు వీళ్ళేమన్నా యిస్తారా?"

ప్రసాద్ దగ్గర సిగరెట్టు తీసుకొని వెలిగిస్తూ నల్లవాడు జవాబు చెప్పాడు:

"లేకపోతే యీ చాకిరీ దేనికీ? కమీషన్ యిస్తారు–"

"ఎంతా?"

"ఏముందీ? రెండేసి, మూడేసీ. ఐనా యీ కరువు కాలంలో యేం చాల్తుంది బాబుగారూ?"

నల్లవాడు ఇంకో అరడజను ఇళ్ళు తిప్పాడు. ఇంటికి పావు డజను తక్కువ లేకుండా తాజా సరుకుంది. కాని వాళ్ళ రేట్లు మాత్రం ప్రసాద్‌కు ఇప్పట్లో అందేట్టు లేవు. అందుకని మొదట్లోలాగే ప్రసాద్ కావాలని అన్నింటినీ వొదిలించుకున్నాడు.

"కాలవ అవతల ఇంకా వున్నయ్–" అన్నాడు నల్లవాడు. వాడు ఊరంతా తిప్పగల సామర్థ్యాన్ని సూచిస్తూన్నందుకు వాడి ఓర్పుకు ప్రసాద్‌కే ఆశ్చర్యం వేసింది. అదీకాక ఇంకా ఎన్నిళ్ళు తిరిగినా మంచి వస్తువుల్ని చూస్తూ మార్కెట్‌లో తిరిగి యేమీ కొనకుండానే బాధపడ్డట్టు యీ లేనిపోని అవస్థకు గురికావటం ప్రసాద్‌కు చాలా అనవసరంగా కనిపించింది.

"పోనిస్తూ––" అన్నాడు, విసుగు చూపిస్తూ.

"ఎబ్బే––భలేవాళ్ళండీ––"

తనకు నచ్చలేదని నల్లవాడు భ్రమపడుతున్నాడు కాబోలు!కాలేజీలో చదివేప్పుడు కుట్టించిన బాపతు తన బట్టల్ని చూసి వెంటపడ్డాడు కాని, తన 'పర్స్' నే చూసినట్టయితే వాడు చేసిన పొరబాటుకు చాలా పశ్చాత్తాపపడి వుండేవాడు– అసలు పొరపాటు పడే వాడు కాదేమో? ముందు ఎట్లా వీణ్ని వదిలించుకోవటం?

"ఇప్పుడు తలకాయ నొప్పిగా వుంది."

"రెండు గంటలు తిరిగి వొదుల్తామా? ఫస్ట్‌క్లాస్-"

ఏ క్లాసయినా లాభంలేదని వాడికి తెలియదు--

"రేపు- తప్పకుండా" అన్నాడు, వాణ్ని నమ్మించి, ఆశపెట్టన్నా వొదిలించుకుందామని.

"రేపెక్కడ కనిపిస్తారూ? లేక నన్నే మీ దగ్గరికి రమ్మంటారా?" ఖాతాదారుల్ని ఎంత జాగ్రర్తగా చూస్తాడూ!

"ఎందుకూ! కాఫీ హొటల్ దగ్గర్నే ఇవాల్టి వేళకల్లా అక్కడే వుంటాను--"

"సరే... మామూలిప్పించండి."

అంతమంచి అందగత్తెల్ని చూపించిన వాడికి కూలి డబ్బు లివ్వకపోవటం ప్రసాద్‌కు చాలా అన్యాయమనిపించింది. బేరం కుదరకపోవటం వాడి తప్పు కాదు కనుక ఇది తప్పదు.

"ఎంతా?"

"మీకు తెలియందేముందీ?" తనకు తెలిస్తే వీడి సహాయం దేనికో?

"రూపాయి చిల్లర లేదే?"

'ఇంకా చిల్లర కూడానా? మీలాటి మహారాజులే ఇట్లా మాట్లాడితే ఎట్లా? ఈ పాటికి నాలుగు బేరాలు కుదిరి యెనిమిది రూపాయిలన్నా పడాల్సింది..."

నల్లవాడి వాలకం బాగాలేదు. వాడి కోపానికి ప్రసాద్ భయపడ్డాడు. లాభం లేదని ప్రసాద్ వాణ్ని రూపాయి దక్షిణతో వొదిలించుకున్నాడు.

మర్నాడు రాత్రి అదే కాఫీ హొటల్ ముందు అదే వేళకు నిలబడి, రోడ్డు మీద తిరుగులాడే జనంవంక ఆతృతగా చూస్తున్నాడు.

"నమస్కారమండీ పంతులుగారూ!"

ఆ నల్లవాడు మళ్ళీ తయారయ్యాడు. ప్రసాద్ మాట్లాడకుండా నిర్లక్ష్యంగా వాడి వైపు చూశాడు.

వాడు అదేమీ లెక్కచెయ్యకుండా "ఇవ్వాళ కొత్తవి నాలు గొచ్చినయ్. మీకు తప్పకుండా నచ్చుతయ్-" అన్నాడు.

"ఒద్దులే--"

"ఇంకా కొత్త ఇళ్ళు సార్--"

"ఉహుఁ"

ఇంతలోనే నల్లవాణ్ని ఎవరో పిలిచారు: "వస్తున్నా!" ఆ కేకకు సమాధానం చెప్పి, ప్రసాద్‌కు కొత్తప్లేటు తిప్పాడు: "అక్కడ నిలబడ్డాడే వాడు మావాడే: వాడి చేతుల్లో సంసారులు ఎంత మంచివాళ్ళున్నారని! పిలవమంటారా?"

ప్రసాద్‌కు మహా విసుగ్గా వుంది. కోపంతో మొహం చిట్లించి అన్నాడు: "రాత్రి చూసినవి చాలు: ఆ అనుభవంతో ఇంతకుముందే ఇద్దర్ని తీసుకెళ్ళి నాలుగు రూపాయిలు సంపాయించుకున్నాను. యింకెవరన్నా కనిపిస్తారేమోనని--"

ఇంతలోనే నల్లవాడి స్నేహితుడు వొచ్చి, "ఏరా! పంతులుగారికి కావాలా యేం? భలేవాళ్ళు" అన్నాడు.

నల్లవాడు తెల్లమొగంవేసి నిట్టూర్చి, "అది కాదు, ఆయన కూడా మనలాగే ఎవరన్నా దొరుకుతారేమోనని చూస్తున్నాట్ట" అని తన వృత్తికి మరో పోటీదారు తగిలినందుకు నొచ్చుకుంటూ వెళ్ళిపొయ్యాడు.

పుస్తకాలమీదా కాలేజీ జీతాలమీదా తగలేసిన డబ్బుకన్నా నల్లవాడికి రూపాయి ఇచ్చి రాత్రి అతి సులభంగా నేర్చుకున్న పాఠం తన బతుకుతెరువు చూపినందుకు ప్రసాద్ అమిత సంతోషంతో, "నల్లవాడే గొల్ల పిల్లవాడే" అని కూనిరాగం తీయసాగాడు.

– *ఫిబ్రవరి, 1944*